

# అనగనగా... ఒక కథ

# లంచం

స్కూటర్ సరిగ్గా నడవట్లేదు.

రోడ్డు బాగా లేదు-స్ట్రీట్ లైట్స్ కూడా వెలగట్లేదు-కరెంట్ లేదు కాబోలు.. స్కూటర్ లైట్ పాడై నాలుగు రోజులైంది.

అమ్మో..స్పీడు బ్రేకర్..స్పీడు బ్రేకర్ కాదు మునిసిపాల్టీ వాళ్ల మేన్‌హోల్....అ !!!

ఆ తర్వాతేమైందో నారాయణరావుకి తెలీదు.

తెలివివచ్చాక చూసుకుంటే..తెలుస్తోంది-

అది ఇల్లుకాదు- ఏదో హాస్పిటల్-ఎమర్జెన్సీ వార్డు!!

ఎప్పుడొచ్చాడో..ఎలా వచ్చాడో తెలీదు-చావుముంగిట్లో కెళ్లొచ్చాడు- వెళ్తున్నాడు-వెళ్లాడోమళ్లాడో తెలీదు మళ్లీ స్పృహ కోల్పోయాడు.

నారాయణరావుది ఓపాటి మంచి ఉద్యోగమే.

జీతంకన్నా గీతం ఎక్కువ అతని సీటుకి. పనిచేసి పెట్టటానికి వచ్చినవాళ్లని ఎంత ఇబ్బంది పెడితే అంత రాబడి.

ఎంత రాబడి ఉన్నా దర్జాగా కార్లో తిరగటానికి లేదు- డొక్కు స్కూటరమ్మేసి ఓ బైక్ కొన్నా- లక్ష ఆరాలూ, సవాలక్ష ఎంక్వయిరీలూ ఆ పై కమీషన్లు-సస్పెన్షన్లూ-అందుకే లోప్రొఫైల్లో లోలోనే ఉండిపోతాడు.

రిటైరయాక హాయిగా..సొంతూళ్లో కారేసుకుని-సొంతింట్లో ఏసీ పెట్టుకుని దర్జాగా ఉండాలని కూడబెడుతున్నాడు- పంచుకోడానికి పిల్లల్లేరు. భార్యా కడుపు నిండా తినలేదు- బీపీ-షుగరూ! ఓ పూటన్నం..ఓ పూట చపాతీ! పాపం! తిండమే కాదు ఆ రోగం వచ్చినప్పణ్నుంచీ రుచిగా వండటం కూడా మర్చిపోయింది. కట్టలు కట్టలుగా డబ్బులు తెచ్చిపడేస్తున్నప్పుడల్లా కన్నీళ్లు పెట్టుకుంటుందా వెర్రిమాలోకం- ఎందుకండీ ఈ పాపం! మీరు చేసే పనిలో నిజాయితీగా వుంటే, నాలుగు జీతం రాళ్లతో కడుపులు నిండవా అంటుంది.

అతనికీ ఇంట్లో తిండి తప్పించుకునే ఛాన్సు చాలాసార్లే వస్తుంది-ఎవరో కాస్త పెద్ద పనిమీద పెద్దపార్టీలొస్తే మధ్యాహ్నం మద్యంతోబాటు ఏ బార్లోనో బిర్యానీ కూడా నడిచిపోతుంది.

ఆరోజు ఏక్సిడెంట్‌కి ముందు బార్లోనే తొమ్మిదయింది.

జేబులో డబ్బులుండాలి..రెండోసారి స్పృహరాగానే గుర్తొచ్చి జేబులు తడుముకోబోయాడు-జేబే కాదు ప్యాంట్ కూడా లేదు-కాలికో బరువైన కట్టు...చేతికీ కట్టు, తల దిమ్ముగా వుంది. తలనిండా బేండేజ్ కట్టు!!

చచ్చాన్రోయ్ అనుకున్నాడు చచ్చి బతికిన నారాయణరావు.

నాలుగు రోజులు స్పృహలో వున్నట్లు రూఢి అయాక స్ట్రెచ్చర్లో తీసుకొచ్చి స్పెషల్ రూమ్‌కి చేర్చారు.

భార్యతోబాటు కొందరు ఆఫీసు స్టాఫ్ స్పెషల్ రూమ్ బైట నిలబడి స్వాగతాలిచ్చారు.

కన్నీళ్లాపుకుంటున్న భార్యని చూడగానే నారాయణరావు కళ్ల నిండా నీళ్లు తిరిగాయి- స్టాఫ్‌ను చూసాక మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

పలకరింపులు పరామర్శలూ అన్నీ అయ్యాక-మిత్రులంతా వెళ్లాక...మాట పెగుల్చుకుని భార్య అడిగింది-

"ఆరోజు చాలా డ్రింక్ చేసారా"

"రోడ్డు బాగోలేదు..పైగా కరెంట్ లేదు...అవునూ..స్కూటరేమైంది?" మాట మార్చడానికి అడిగాడు.

"స్కూటర్‌కేమీ కాలేదు- తల పగల్లేదు దాని కాలూ చెయ్యీ ఫ్రాక్చర్ అవలేదు.." శోకంతో రోషాన్నీ ఉక్రోషాన్నీ అణుచుకుంటూ అంది ఆవిడ.

"సువర్ణా...నువ్వు నన్ను దెప్పిపొడుస్తున్నావ్"

సువర్ణ చెంగు నోటి ముందు పెట్టుకుని కూడా ఏడుపు ఆపుకోలేకపోతోంది.

నారాయణరావుకి కొంచెంసేపు ఏమ్మాట్లాడాలో తెలీలేదు-

గొంతులో మాటల్ని గుండెల్లో దిగమింగుకున్నాడు.

సువర్ణ నాలుగు రోజులుగా అనుభవిస్తున్న ఆందోళనంతనీ కన్నీరుగా మార్చుకుని రిలాక్సవుతోంది.

కొంతసేపయాక..."పుల్లంరాజు-కాంట్రాక్టర్‌లే..అపార్ట్‌మెంట్ లేఔట్‌ని సేంక్షన్ చేయమనీ...చాలా రోజుల్నించి తిప్పుతున్నాను...నిన్న రాత్రీ.."

"నిన్నకాదు...నాలుగు రోజులైంది మీరు మనుషుల్లోలేక...నాలుగురోజులూ మత్తు దిగనంత తాగారు అనిపించింది"

ఆమె ఏడుపుని అతను ఆపలేకపోయాడు-తనే తేరుకుని..."తలబద్దలయింది-ఇరవై నాలుగ్గంటల వరకూ చెప్పలేమన్నారు-మళ్లీ నలభై ఎనిమిదిగంటలన్నారు..దేవుడిదయ..మా ప్రయత్నం మేం చేస్తున్నాం అన్నారు డాక్టర్లు-మీ గురించి

**నారాయణరావు ఆ వ్యక్తిని చూడగానే రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాలనుకున్నాడు-ఒక చేతికి..అదే లంచం తినే ఎడం చేతికి ఇంతలావు సిమెంట్ కట్టు-కళ్లతో నమస్కరించాడు-కన్నీళ్లతో కాళ్లు కదిగాడు-తెలిసీ తెలియనట్టుగా 'సారీ' అన్నాడు.**

నాకన్నా ఎక్కువ కంగారుపడ్డారు వాళ్లు తెలుసా'' సువర్ణ మాట మాటకీ కురుస్తున్న కన్నీళ్లని చూడకుండా కళ్లు మూసుకున్నా చెవులు ఆమె రుద్ధ-క్రుద్ధ కంఠాన్ని తప్పించుకోలేకపోయాయి.

ఆ మాట పూర్తయాక దీర్ఘమయిన నిశ్వాస-దాని అర్థం బాధో-వ్యధో-నస ఆపేయమన్న శాసనమో తెలియదు- కళ్లు మూసుకున్నాడు నారాయణరావు-కళ్లెత్తి చూసింది సువర్ణ-

మళ్లీ 'ధైర్యంగా' కొంత నిశ్శబ్దం గడిచాక ''ఎవరు తెచ్చారీ హాస్పటల్‌కి''

''ఎవరో పుణ్యాత్ముడు-రోజూ వచ్చి మీకెలా వుందని అడిగి వెళ్తున్నాడు పాపం!''

''నా ప్యాంట్ జేబులో డబ్బులు??'' ఆ పుణ్యాత్ముడి మీద డౌట్‌తోనే అడిగాడు.

''పదహారు వేల ఐదొందల ఏభై ఆరు-ఇంటి నుండి వెళ్లేటప్పటికి మీ జేబులో చిల్లరతో కలిసి ఏభై ఆరు రూపాయలుండేవి''

''అవును ఐదొందలు ఒకడూ...పదహారు వేలు పుల్లంరాజూ ఇచ్చార్లే-అన్నీ ఉన్నాయా-''

''ఒక్క పైసా కూడా తేడాలేదు- మీ వాచీ ఉంగరం సెల్ ఫోనూ కూడా అతనే నాకు తెచ్చిచ్చాడు-''

అంత మంచివాళ్లు లోకంలో వుంటారా? నారాయణరావు కుంచించుకుపోతున్నాడు-తను..అలాంటి పరిస్థితిలో పడి వున్న వాళ్లెవరైనా ఉంటే...హాస్పటల్‌కి తెస్తాడా...తేడు!!

డబ్బులు వాళ్ల వాళ్లకి ఇస్తాడా..ఇవ్వడు!!

నారాయణరావుకి స్వస్వరూప జ్ఞానంతో బాటు తనలో లోపం కూడా తెలుస్తోంది...

ఆ పుణ్యాత్ముడెవరో చూడాలని వుంది!

స్పెషల్ రూమ్ తలుపుకొట్టిన శబ్దమైంది.

సువర్ణ తలుపు తెరచింది-

''అమ్మా...నమస్తే! ఎమర్జెన్సీ వార్డు నుంచి షిఫ్ట్ చేసారుట సార్‌ని. అక్కడ చెప్తే...ఇక్కడికి వచ్చాను- బాగున్నారు కదా..''

''మెలుకువగానే ఉన్నారు-రండి..''

ఆ గొంతెక్కడో విన్నదే- ఎవరో గుర్తు రావట్లేదు నారాయణరావుకి, మాటలూ పూర్తిగా వినబడటం లేదు- అతను వచ్చేలోగా నిద్రనటిస్తూ కళ్లుమూసుకున్నాడు. అదే..ఆఫీసులో అయితే వచ్చిన వ్యక్తిని నిర్లక్ష్యంగా చూసి ఇంటర్‌కమ్‌లో ఎవరితోనో పనున్నట్లు బాతాఖానీ వేస్తాడు-ఇప్పుడు కళ్లు మూసుకుని వుంటే...నగం గోల వుండదు-


సువర్ణ వచ్చి పిలిచింది-కాదు తట్టింది- ''ఇదిగో ఎవరొచ్చారో చూడండి మీ ప్రాణాన్ని కాపాడి, మిమ్మల్ని హాస్పటల్‌కి చేర్చిన పుణ్యాత్ముడు'' అంది.

మనవల్ల చాలామంది మేలు పొంది ఉంటార్లే వాళ్లలో ఒకడు అనుకున్న నారాయణరావు-కళ్లు తెరచి ఆ పుణ్యాత్ముణ్ని చూసి షాక్ అయాడు!!

అతను...తన దగ్గరకి ఆరోజు వచ్చిన వ్యక్తి!

తన ఇంటి ప్లాను పోయిందని కాపీ ఇమ్మని నెల రోజులుగా తిరుగుతున్న వ్యక్తి!!

వెయ్యి రూపాయలివ్వందే పని కదలదని తను పొమ్మన్న వ్యక్తి!



ఐదు వందలు చేతికిచ్చి-ఇంకేం ఇవ్వలేనన్న గుడిసెలలో బడుగు వ్యక్తి!

జేబులో వున్న పదహారు వేల ఐదు వందలలో..ఆ..'అయిదు' వందలిచ్చిన వ్యక్తి!!

నారాయణరావు ఆ వ్యక్తిని చూడగానే రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాలనుకున్నాడు-ఒక చేతికి..అదే లంచం తినే ఎడం చేతికి ఇంతలావు సిమెంట్ కట్టు-కళ్లతో నమస్కరించాడు-కన్నీళ్లతో కాళ్లు కడిగాడు-తెలిసీ తెలియనట్టుగా 'సారీ' అన్నాడు-

''సువర్ణా..5 వందలు అతనికియ్యి...'' అన్నాడు- సువర్ణ డబ్బిచ్చింది-

''ఆఫీసు వాళ్లకి చెప్పి నీ కాయితాలు ఇప్పిస్తాను. టచ్‌లో వుండు'' నారాయణరావుకి అతన్ని పంపేసాక ఏడుపొచ్చింది-కాదు..నిజంగా దుఃఖం వొచ్చింది.

*